

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ , జనవరి 28(ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దోమలగూడలో జరిగిన ఎల్ఐసీ ఓబీసీ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైమాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నఓబీసీ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా బీసీ కులగణన నిర్వహించి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ఎల్ఐసీ ఓబీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అజయ్ అధ్యక్షత వహించగా అసోసియేషన్ అధ్యక్షుడు యోగేంద్రచౌదరి, ప్రధానకార్యదర్శి శ్రీకుమార్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

సుందరకాండ కార్యసిద్ధి హోమం ప్రారంభం

చిక్కడపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ అంజనేయస్వామి ఆలయంలో అష్టోత్తర శత హనుమాన్ చాలీసా సహిత శ్రీమత్ సుందరకాండ కార్యసిద్ధి హోమం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. అయిదు రోజులపాటు కార్యక్రమాలు జరుగుతాయి. తొలిరోజు లోక కల్యాణార్థం స్వయంభువు మహా మహిమాన్వితుడైన ఆంజనేయస్వామి వారి సంపూర్ణ అనుగ్రహము కోసం హోమం నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి దేవనాథం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ చైర్మన్‌గా రాజు



జీవీఎన్‌రాజు

చిక్కడపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా అల్నిని క్లబ్ జోన్ 12 చైర్మన్‌గా వ్యక్తిత్వ వికాసనిపుణులు జీవీఎన్ రాజు నియమితులయ్యారు. 38 సంవత్సరాల కిందట ఒక సభ్యుడిగా చేరి అనంతరకాలంలో జాతీయ శిక్షకుడిగా సేవలందించి చైర్మన్ పదవికి ఎంపికయ్యారు. సంస్థ సభ్యులు సునీల్ కుమార్, వినయ్ మెహతా, మనోజ్ తక్కర్ శుభాకాంక్షలు తెలిపారు. జూనియన్ చాంబర్ ఇంటర్నేషనల్ 107 సంవత్సరాలుగా అంతర్జాతీయస్థాయిలో వ్యక్తిత్వ వికాసం సంస్థగా పనిచేస్తుంది.

సుందరయ్యపార్కులో ఉచిత వైద్య శిబిరం

రాంనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు కార్పొరేట్ ఆస్పత్రులు ముందుకు రావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్, రవి హీల్స్ ఆస్పత్రిల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు బీపీ, షుగర్ ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఆర్.వివేక్, డాక్టర్ విజయభాస్కర్, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోల్నాక డివిజన్‌లో..

గోల్నాక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ సుందర్‌నగర్‌లోని భవసార భవన్‌లో దళిత రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మార్పీస్ నగర ఉపాధ్యక్షుడు నర్వదాస్ ఆధ్వర్యంలో ఆదివారం కిమ్స్ ఆస్పత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరంను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏడెల్లి అజయ్‌కుమార్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలలో ఆయా సంస్థలు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు కృష్ణ, నవీన్, కార్తీక్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రావూరి సుభాష్‌బాబు, తదితరులు

సమాజ మార్పునకు చిత్రకళ దోహదం చేస్తుంది

- ప్రముఖ చిత్రకారుడు రావూరి సుభాష్‌బాబు

రాంనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజ మార్పుకు చిత్రకళ దోహదం చేస్తుందని, చిత్రకారుల కృషి చరిత్ర గతిని మారుస్తుందని ప్రముఖ చిత్రకారుడు రావూరి సుభాష్‌బాబు అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎల్.ఆర్.వెంకట రమణ వ్యాసాల సంపుటి కళా ప్రపంచం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి చిత్రకారుల అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో పోరాటాలను చిత్రప్రసాద్ బొమ్మలు రికార్డు చేశాయన్నారు. తోట వైకుంఠం, సూర్యప్రకాష్ వంటి వారు తెలంగాణ ప్రకృతిని తమ బొమ్మలలో చూపారని అన్నారు. తెలంగాణ సాహితి కార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన చిత్రకారులను పరిచయం చేసిన ఈ పుస్తకాన్ని కవులు, రచయితలు, కళాకారులు తప్పక చదవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్.రఘు, కూరెళ్ల శ్రీనివాస్, డాక్టర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బుర్రవీణ వాయిద్యకళాకారుడిని సన్మానిస్తున్న చిన జీయర్‌స్వామి, మల్లు నందిని

బుర్రవీణ వాయిద్య కళాకారుడికి సన్మానం

చిక్కడపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్రం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుగ్రహీత, నారాయణపేట జిల్లాకు చెందిన బుర్రవీణ వాయిద్యకళాకారుడు దాసరి కొండప్పను శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్‌స్వామి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి భట్టి నందినిల ఆదివారం సన్మానించారు. వారు మాట్లాడుతూ ఆచార్య భగవత్‌రామానుజులవారు సమాజంలో పరిపుష్టం చేసిన దాస సంస్కృతి సంప్రదాయాలలో బుర్రవీణ వాయిద్యం ఒకటన్నారు. కొండప్పకు ఈ అవార్డు రావడం మొత్తం కళాప్రపంచానికి ఒక అరుదైన గౌరవంగా భావించవచ్చునని పేర్కొంటూ కొండప్పను ప్రశంసించారు.

సమాజశ్రేయస్సే సాహిత్య లక్ష్యం కావాలి

చిక్కడపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సే సాహిత్య లక్ష్యం కావాలని ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం అన్నారు. రిపబ్లిక్‌డే వేడుకల సందర్భంగా కమలాకర లలితకళాభారతి, కమలాకర భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో కవి పెద్దూరి వెంకటదాసు పర్యవేక్షణలో కవిసమ్మేళనం జరిగింది. అనంతరం జరిగిన సభలో వెంకటదాసును సన్మానించారు. భారతీ కమలాకర్, జల్ది విద్యాధరరావు, డా. కృష్ణకుమారి, త్రినాథరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు పురస్కారాలు ప్రదానం..

కళానిలయం ఆధ్వర్యంలో విద్యార్థినాయకుడు, తెలంగాణ అభిమాని ఫణిభార్గవ్ యాదిలో పేరిట జయంతి వేడుకలు జరిగాయి. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి స్పెషల్ కరస్పాండెంట్ హేమలత, పి. అంజనేయులుకు నగదు పురస్కారాలు బహూకరించారు. సీనియర్ జర్నలిస్ట్ నర్సింగ్‌రావు కుటుంబానికి, పేద విద్యార్థిని సాదియాబేగంకు ఆర్థిక సాయం అందజేశారు. సభలో సీనియర్ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి, కళా జనార్దనమూర్తి, భైస దేవదాసు, వంశీ రామరాజు పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యంగిరా మహాయాగం

- హాజరైన మంత్రి కొండా సురేఖ

కవాడిగూడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కుర్తాళం శ్రీ సిద్దేశ్వర పీఠం ఆధ్వర్యంలో శ్రీ సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్న కోటి ప్రత్యంగిరా మహాయాగం ఆదివారం అత్యంత వైభవోపేతంగా పూర్ణాహుతితో ముగిసింది. చివరి రోజు మహాయాగంలో స్వామి సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి, స్వామి రమ్యనంద స్వామి పూర్ణహుతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ హాజరయ్యారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్వామి సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి మాట్లాడుతూ, కోటి ప్రత్యంగిరా మహాయాగంతో సమాజంలోని అరిష్టాలు తొలగిపోయి ప్రజలకు శుభం జరుగుతుందన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో ప్రత్యంగిరా మహాయాగం పూర్ణాహుతి, యాగం నిర్వహిస్తున్న నిర్వాహకులు



మంత్రి కొండా సురేఖకు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీ సిద్దేశ్వారనంద భారతి

దేశంలో తొలిసారిగా 25వేల కిలోల ఎండు మిరపకాయలతో ఈ యాగం చేయడం అమ్మవారి కృప అని పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కుర్తాళం శ్రీ సిద్దేశ్వర పీఠం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నగర నడిబొడ్డున ఎన్టీఆర్ స్టేడియంలో కోటి ప్రత్యంగిరా మహాయాగం చేయడం శుభపరిణామమని అన్నారు. ఈ యాగం వల్ల రాష్ట్రానికి పట్టిన అరిష్టాలు పోయి శుభాలు కలగాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

కార్యక్రమ కో-ఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషణ్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. చివరి రోజు కావడంతో నగర వ్యాప్తంగా ఉన్న భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైకోర్టు నియామకాల్లో ఎస్సీ ఎస్టీ న్యాయవాదులకు అవకాశాలు కల్పించాలి

- సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్

కవాడగూడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు నియామకాల్లో త్వరలో చేపట్టే ప్రభుత్వ ప్లీడర్, ప్రభుత్వ శాఖల స్టాండింగ్ కౌన్సిల్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పదవుల భర్తీ నియామకాలు జరగనున్నాయి. వాటిలో ఎస్సీ ఎస్టీ న్యాయవాదులకు అవకాశాలు కల్పించాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ ఈ నియామకాల్లో ఎలాంటి అవినీతి, సిఫార్సులకు తావు లేకుండా పారదర్శకత పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఫోరమ్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం రవీందర్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఇంటికి భగవద్గీత'



ఈశ్వర్‌కుమార్

నల్లకుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో ప్రజలకు ఎదురయ్యే పలు సమస్యలను పరిష్కరించుకుంటూ ఆదర్శవంతంగా స్ఫూర్తి పొందడానికి భగవద్గీతను అలవర్చుకోవాలని భగవద్గీత యూనివర్సల్ ట్రస్ట్ చైర్మన్ కె.ఈశ్వర్‌కుమార్ కోరారు. ఈ మేరకు తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలుగు భాషలో సరళమైన రీతిలో భగవద్గీత అందరికీ అర్థమయ్యేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేటలోని ట్రస్ట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018 నుంచి ప్రతి ఇంటింటికీ భగవద్గీతను పంపించాలనే సంకల్పంతో కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు భగవద్గీత చేరువ కావడం ద్వారా విజ్ఞానవంతులై ఆధ్యాత్మిక విలువలతో జీవించాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు.

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు భట్టికి ఆహ్వానం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వచ్చే నెలలో హైదరాబాద్ ఆతిథ్యమిస్తున్న నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆ సంఘం జాతీయ జీవితకాల అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్ రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు ప్రజాభవన్‌లో భట్టిని మర్యాదపూర్వకంగా కలిసి, పోటీల వివరాలను తెలియజేశారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌లో ఈ ప్రతిష్టాత్మక పోటీలు నిర్వహిస్తుండడంతో ప్రభుత్వ సహకారం కావాలని భట్టిని లక్ష్మణ్ రెడ్డి కోరారు. ఈ పోటీలు ఫిబ్రవరి 8 నుంచి 11వ తేదీ వరకు గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్నాయి. 20 రాష్ట్రాలకు చెందిన సుమారు నాలుగు వేల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.



భట్టిని ఆహ్వానిస్తున్న మర్రి లక్ష్మణ్ రెడ్డి

తైక్వాండోలో హర్షితకు స్వర్ణం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ అమ్మాయి ఎం.హర్షిత స్వర్ణ పతకం సాధించింది. బెంగుళూరులో జరిగిన ఈ పోటీల్లో అండర్-18 విభాగం 40 కిలోల కేటగిరీలో హర్షిత పూమ్సేలో స్వర్ణం, ఫైటింగ్ కేటగిరీలో రజతం సాధించింది. 68 కిలోల విభాగంలో అనిరుద్ధా, 50 కి. కేటగిరీలో రితిక్ స్వర్ణాలు నెగ్గారు.



పతకాలతో తైక్వాండో క్రీడాకారులు



మహిళా శక్తి సమ్మేళన పోస్టర్ ఆవిష్కరిస్తున్న గీతామూర్తి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి

బర్కత్‌పుర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే సాధికారిత సాధ్యమవుతుందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని జాగృతి కార్యాలయంలో ఆర్ఎస్ఎస్ బర్కత్‌పుర విభాగ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కోరారు. త్వరలో నగరంలో మహిళాశక్తి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా శక్తి సమ్మేళన పోస్టర్ ఆవిష్కరించారు. ఆర్ఎస్ఎస్ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్ దుర్గిశెట్టి

అపోలో ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలకు గుర్తింపు

- కలెక్టర్ అనుదీప్ దుర్గిశెట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన కింద అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అందిస్తున్న సేవలకు గుర్తింపు లభించింది. అపోలో సేవలను గుర్తిస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ దుర్గిశెట్టి అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రీసెర్చ్ సీఈవో అపర్ణారెడ్డికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ ఇనిస్టిట్యూట్ రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద అనేక మంది రోగులకు చికిత్స అందించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకట్ దీపక్ చోడిపల్లి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ మహబూబ్ పాషా, జాయింట్ కలెక్టర్ మధుసూదన్, ఏఐఎంఎస్ఆర్ సీనియర్ మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రాజేష్, సునీల్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ రెన్యువల్ అంటూ మోసం

- ఇద్దరిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గతంలో ఇన్సూరెన్స్ తీసుకున్న వారి వివరాలు సేకరించి, ఇన్సూరెన్స్ రెన్యువల్ పేరుతో మోసం చేస్తున్న ఇద్దరిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నైకి చెందిన బల్లారి పవన్ కుమార్ (27), కర్నూలుకు చెందిన సౌద్రి బసవరాజ్ (27) ఇద్దరూ కలిసి కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు, చోళమండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలో ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్న వారి వివరాలు సేకరించారు. కాల్ సెంటర్ నుంచి వారికి ఫోన్‌లు చేయించి, చోళ ఇన్సూరెన్స్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ఇన్సూరెన్స్ పాలసీ రెన్యువల్ పేరుతో కొద్ది మొత్తాలు తమ ఖాతాలో జమ చేయించుకున్నారు. వీరి దందాపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 7 మొబైల్ ఫోన్లు, 2 లాప్‌టాప్‌లు 6 ఏటీఎం కార్డులు, 6 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- కార్యకర్తలే పార్టీకి బలం: ఎమ్మెల్సీ ఎల్. రమణ
- ముషీరాబాద్ బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో దొంగల చేతివాటం

ముషీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే పార్టీకి బలమని ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్. రమణ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని కషిష్ హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎల్.రమణ మాట్లాడుతూ మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలో 23 స్థానాలలో బీఆర్ఎస్ విజయం సాధించింది అది కార్యకర్తల కృషితోనే సాధ్యమయిందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, మాజీ కార్పొరేటర్లు ముఠా పద్మ, మాచర్ల పద్మజ, పార్టీ సీనియర్ నాయకుడు బింగి నవీన్, 6 డివిజన్‌ల బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, రాకేష్, వల్లాల శ్యామ్‌యాదవ్, సురేందర్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి, షరీఫ్, శివముదిరాజ్, ముక్తార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, మాగంటి గోపీనాథ్

సమావేశంలో దొంగల చేతివాటం

ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో దొంగలు తమ చేతివాటం చూపారు. సమావేశం ముగిసిన అనంతరం ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రమణ, తలసాని సాయికిరణ్ యాదవ్‌తో పార్టీ నాయకులు ఫొటోలు దిగుతుండగా దొంగలు జేబులు కొట్టేశారు. ముగ్గురి సెల్‌ఫోన్లు, పార్టీ నాయకులు బబ్లూ జేబులో నుంచి రూ. 20 వేలు, యాదగిరి జేబులో నుంచి రూ.14 వేలు, వై.శ్రీనివాసరావు జేబులో నుంచి రూ.3500 లు కొట్టేశారు.

బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా ప్యాంటు వెనుక జేబులో చేయి పెట్టగా గమనించిన ఆయన దొంగను పట్టుకున్నారు. మరో ఇద్దరు దొంగలను ముషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సాయిబాబా టెంపుల్ 11కేవీ ఫీడర్ పరిధిలోని వీహెచ్, మురళీధరరావు నివాసాలు, యూనియన్ బ్యాంక్, సీఈకాలనీ పార్క్, ఇంద్రప్రస్థ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 12.30, సీఈ కాలనీ పరిధిలోని శివం, శారదానగర్, ఈసేవ, బాగ్ అంబర్‌పేట ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30, బతుకమ్మకుంట పరిధిలోని పాములబస్తీ, మల్లన్నటెంపుల్, గంగానగర్, పోచమ్మబస్తీ ప్రాంతాల్లో 3 నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ విజయ భాస్కర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమరవేణి నర్సాగౌడ్

జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలి

తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్

బర్కత్‌పుర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గౌడ కులస్థుల ఉపాధిని దెబ్బతీస్తున్న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెల్ట్ షాపులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని గౌడ జన హక్కుల పోరాట సమితి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టి ఆయన నిర్మించిన కోటలను పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జాతీయ కార్యదర్శి సిద్ది రాములుగౌడ్, హైకోర్టు న్యాయవాది బాలసాని సురేష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్

రాంనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని న్యూ అచ్చయ్యనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని కార్పొరేటర్ కె.రవిచారి బస్తీవాసులకు హామీ ఇచ్చారు. ఆదివారం న్యూ అచ్చయ్యనగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని బస్తీవాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలమండలి ఎండీ దానకిషోర్, జీఎంల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

గోవధ శాలను పూర్తిగా మూసివేయాలి

తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్



గోశాలకు దాన అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బర్కత్‌పుర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమ గోవధ శాలను పూర్తిగా మూసివేసి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ డిమాండ్ చేశారు. గోవధ నిషేద చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఆదివారం భూ లక్ష్మీమాత గోశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో పశు దానం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి, ముంగి, నాల్కాల్ తదితర ప్రాంతాలలో గోవులను అధికంగా వధిస్తున్నారని, పాతబస్తీలో కూడా ఇదే కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిదులు మహేందర్ గుప్తా, నిర్మల్‌కుమార్ జైన్, ప్రవీణ్, నీతా ఖండేల్‌వాల్, ప్రేమ్‌చంద్, గోశాల ప్రతినిధి రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేజర్ ఎస్ఎంజీ ఖాద్రీ

ముస్లిం డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి

- ముస్లిమ్స్ కలెక్టివ్ ఫర్ జస్టిస్ సంస్థ

పంజాగుట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముస్లిమ్స్ కలెక్టివ్ ఫర్ జస్టిస్ సంస్థ డిమాండ్ చేసింది. గత ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ తమను కలవడానికి కూడా అవకాశం ఇవ్వలేదని, అలాంటి పని ప్రస్తుత ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చేయొద్దని సంస్థ ప్రతినిధులు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ సభ్యులు మేజర్ ఎస్.ఎం.జీ ఖాద్రీ, ఖాలీద్ రసూల్‌ఖాన్, డాక్టర్ ఇక్బాల్ జావీద్, కుత్సియా తబస్సుమ్, అఫ్సర్ జహన్, తదితరులు మాట్లాడారు. ముస్లిం కమ్యూనిటీకి చెందిన నిజాయితీపరులైన రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఎంతోమంది ఉన్నారని వారి సేవలను ప్రభుత్వం ఉపయోగించుకోవాలన్నారు. వక్ఫ్ బోర్డు, హజ్ కమిటీ, ఉర్దూ అకాడమీలకు నిజాయితీపరులను నియమించాలన్నారు. ముస్లిం అభివృద్ధికి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. పాతబస్తీవాసులకు మెట్రోరైలు సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలన్నారు. సమావేశంలో సంస్థ సభ్యులు షకీల్, సనావుల్లాఖాన్, ఎస్.ఎస్.తన్వీర్, నయీముల్లా షరీఫ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీగా నియమితులైన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే, దరణీ పోర్టల్ కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జీ.ఎన్.కేశవ్, శ్రీరాములు యాదగిరి తదితరులు - రాంనగర్, ఆంధ్రజ్యోతి

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

రాంనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బీసీ,ఎస్సీ,ఎస్టీ చైతన్యవేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ చైతన్య వేదిక నియోజకవర్గం అధ్యక్షుడు బోనం బన్ని ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం అశోక్‌నగర్‌లోని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బోనం ఊర్మిళ, స్థానిక గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్, వివిధ పార్టీల నేతలు వినయ్‌కుమార్, ముఠాజైసింహ, రాకేష్, అనిల్‌కుమార్, భాస్కర్, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.